


# మనజనప్రగతి


జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 216 పేజీలు : 8 వెల : రూ.2/- సోమవారం 31 ఆగస్టు 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..





## నేడు వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం

- మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం
- రేపు వెలిగొండ పండుగ వద్ద కలుద్దామంటూ ప్రజలకు పిలుపు

**అమరావతి,మన జన ప్రగతి ఆగస్టు 30:** మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, **మిగతాది 2లో...**

# ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం

- 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' అవార్డును ప్రదానం చేసిన అధ్యక్షుడు మిర్జియోయెవ్
- 30కి పైగా అంతర్జాతీయ అవార్డులు అందుకున్న భారత నేతగా మోదీ రికార్డు
- తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు
- ఉజ్బెకిస్థాన్‌లో ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించిన ప్రధాని

**న్యూఢిల్లీ,మన జన ప్రగతి ఆగస్టు 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' ఆర్డర్‌తో ఆయన్ను సత్కరించింది. ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది.

ఈ పురస్కారంతో, ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న భారత నేతగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన **మిగతాది 2లో...**





# మరో జల ప్రళయం..?

## నేపాల్‌లో హై అలర్ట్ జారీ

- నేపాల్‌లోని భోటే కోశి నదికి ఆకస్మిక వరద హెచ్చరిక జారీ
- నదిలో ప్రవాహం పెరిగిన శబ్దాలు రావడంతో అప్రమత్తమైన అధికారులు
- రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన
- హిమానీనదం విస్ఫోటనం తర్వాత మరో సంక్షోభంతో నేపాల్ ఆందోళన

**అమరావతి,మన జన ప్రగతి ఆగస్టు 30:** ఇటీవలే హిమానీనదం విస్ఫోటనం కారణంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌ను మరో ముప్పు భయపెడుతోంది. భోటే కోశి నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో జాతీయ విపత్తు అవాయ తగ్గింపు, నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్ఆర్ఎంఎ) నేడు తీవ్ర వరద హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, స్థానిక అధికారులు అత్యంత **మిగతాది 2లో...**

# దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

- జైపూర్‌లో కొందరికి మళ్లీ నిర్వహణ
- మొత్తం 2.65 లక్షల మందికి పైగా హాజరైన అభ్యర్థులు
- జైపూర్‌లో విద్యుత్ అంతరాయం... 2,445 మందికి మళ్లీ పరీక్ష
- సెప్టెంబర్ 5న ప్రభావిత విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణ
- భారీ భద్రత, నిఘా మధ్య పరీక్షలు నిర్వహించిన ఎన్‌బీఈఎంఎస్



**న్యూఢిల్లీ,మన జన ప్రగతి ఆగస్టు 30:** దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2.65 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, జైపూర్‌లోని ఒక పరీక్షా కేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడి అభ్యర్థులకు మళ్లీ పరీక్ష **మిగతాది 2లో...**

# 77వసారి ఢిల్లీకి సీఎం రేవంత్

- మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మంతనాలు



2లో



2లో

# మొక్కలు నాటే లక్ష్యం 91 శాతం పూర్తి

- ఇంటికో పండ్ల మొక్క..ఆరోగ్యానికి బంగారు బాట- వనమహోత్సవ పురోగతి సమీక్షలో మంత్రి సీతక్క




# మాజీ మంత్రి ధర్మాన పై కేసు

- బలవంతంగా గృహ ప్రవేశాలు చేయించారని ఆరోపణ
- ధర్మానతో పాటు మరో ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు
- గృహనిర్మాణ శాఖ డీఈఈ ఫిర్యాదుతో పోలీసుల చర్యలు
- హుద్‌హుద్ బాధితుల ఇళ్ల పంపిణీలో వివాదం

**అమరావతి,మన జన ప్రగతి ఆగస్టు 30:** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా గృహ ప్రవేశాలు చేయించారన్న ఆరోపణల నేపథ్యంలో శనివారం **మిగతాది 2లో...**

# హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం


- రూ.500 కోట్ల భూమిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే కుట్ర
- ఉపసంహరించుకోవాలని
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్
- సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ



2లో

# నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

- రంగంలోకి భారత్, చైనా రెస్క్యూ బృందాలు
- 788కి పెరిగిన మృతుల సంఖ్య
- ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు



2లో

# ప్రచారం కోసమే జగన్పై నిందలు

## విజయసాయిపై సజ్జల ఫైర్

**అమరావతి,మన జన ప్రగతి ఆగస్టు 30:** వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి విజయసాయి రెడ్డి విమర్శలపై తీవ్రంగాస్పందించారు. విజయసాయిని జగన్ గతంలోఎంతో అభిమానించారని, ఇప్పుడు సొంత రాజకీయాల కోసం, ప్రచారం కోసం జగన్ ను, వైసీపీనిఆయన విమర్శించడం సరికాదని అన్నారు. విజయసాయి రెడ్డి సొంతంగా రాజకీయాలు చేసుకోవచ్చని, అయితే తమను టార్గెట్ చేస్తే మాత్రం గట్టిగాస్పందిస్తామని సజ్జల హెచ్చరించారు. విజయసాయి **మిగతాది 2లో...**



# ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం

(మొదటి పేజి తరువాయి)

30కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. గత జులైలోనే ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ దేశ అత్యున్నత పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్న'ను మోదీకి బహూకరించిన విషయం తెలిసిందే.

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీకి తాష్కెంట్‌లో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు మిర్జియోయెవ్ స్వయంగా మోదీకి స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తన పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ ఓ ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 52 మంది యోగా అభ్యాసకులు ఇందులో పాల్గొన్నారు. వారి ప్రదర్శనను ప్రశంసించిన మోదీ, ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్నందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఉజ్బెకిస్థాన్ యోగాను ప్రేమిస్తోంది!' అంటూ ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం.

# మరో జల ప్రళయం..?

(మొదటి పేజి తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది.టిబెట్ సరిహద్దు సమీపంలో హిమాలయాల్లో హిమానీనదం కూలిపోవడంతో అనేక గ్రామాలు ధ్వంసమై, భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పెను విషాదం నుంచి కోలుకోకముందే ఇప్పుడు భోటే కోశి నది నుంచి మరో ప్రమాదం పొంచి ఉంది.

"భోటే కోశి నదిలో వరద ప్రవాహం పెరిగిన శబ్దాలు వినిపించినట్లు రసువా జిల్లా పరిపాలన కార్యాలయానికి సమాచారం అందింది" అని ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఈ సమాచారం మేరకు రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. నది చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తదుపరి సమాచారం అందిన వెంటనే మరిన్ని వివరాలు అందిస్తామని తెలిపింది.

కొద్దిసేపటికే ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ మరో పోస్ట్ చేసింది. భోటే కోశిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు నివేదికలు అందుతున్నాయని, అందువల్ల సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. "రసువాలోని భోటే కోశి నదిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు తెలుస్తోంది. కాబట్టి రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వాన్ సహా ప్రభావిత ప్రాంతాలలో సహాయ, పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమైన సిబ్బంది, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని విజ్ఞప్తి చేసింది. ఈ ఆకస్మిక పరిణామంతో నేపాల్ అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. సహాయక బృందాలను అప్రమత్తం చేస్తూ, నష్టం జరగకుండా చర్యలు ముమ్మరం చేసింది.

# మాజీ మంత్రి ధర్మాన పై కేసు

(మొదటి పేజి తరువాయి)

ఆయనతో పాటు మరో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గృహనిర్మాణ శాఖ శ్రీకాకుళం డీఈఈ వి.వి. సత్యాజీ అందజేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరణం సురేశ్ వెల్లడించారు. గతంలో హుద్‌హుద్ తుపాను బాధితులైన మత్స్యకార కుటుంబాల కోసం ప్రభుత్వం గృహాలను నిర్మించింది. పంపిణీ సమయంలో కొంతమంది లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో ఆయా ఇళ్లను ఖాళీగా ఉంచారు.

ఈ నేపథ్యంలో తమకు ఆ ఇళ్లను కేటాయించాలని కోరుతూ వైసీపీకి చెందిన కొందరు మత్స్యకారులు గతంలో కలెక్టరుకు విన్నవించుకున్నారు. అయితే, గత మే 14వ తేదీన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్యతో పాటు మరో ఆరుగురు మత్స్యకారులు నిబంధనలకు విరుద్ధంగా ఆ ఇళ్లలోకి బలవంతంగా ప్రవేశించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డీఈఈ ఫిర్యాదు మేరకు మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సురేశ్ వివరించారు. ఈ పరిణామం ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది


# ప్రచారం కోసమే జగన్పై నిందలు

(మొదటి పేజి తరువాయి)

ఆరోపణలను ఇకపై పట్టించుకోబోమని,పార్టీ నేతలు కూడా వాటికిప్రాధాన్యం ఇవ్వొద్దనిసూచించారు. జగన్ నాయకత్వాన్ని లక్ష్యంగాచేసుకుని వ్యక్తిత్వ హననం చేస్తున్నారని సజ్జల ఆరోపించారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిందిజగనేనని, వైసీపీకి సుదీర్ఘకాలం నాయకత్వంవహించే సత్తా ఆయనకే ఉందన్నారు. పార్టీని వీడినవారి గురించి జగన్ ఎప్పుడూ ప్రతికూలంగామాట్లాడలేదనిచెప్పారు. జగన్ మతమార్పిడులనుప్రోత్సహించారని విజయసాయి చేసిన ఆరోపణలుదారుణమని సజ్జల మండిపడ్డారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే జగన్, వైసీపీపైవిమర్శలు చేస్తున్నారని, విజయసాయి పబ్లిసిటీకోసమే ఈ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

# నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

● రంగంలోకి భారత్, చైనా రెస్క్యూ బృందాలు ● 788కి పెరిగిన మృతుల సంఖ్య ● ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు



**ఖాట్మండ్ :మన జన ప్రగతి ఆగస్టు 30:** నేపాల్‌లో జల ప్రళయం సృష్టించిన ముప్పునకు మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆకస్మిక వరదలతో మృతుల సంఖ్య 788కు చేరిందని నేపాల్ పోలీసులు తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం.. చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 264 మంది మరణించారు. ఆ తర్వాత నవల్పరాసి ఈస్ట్‌బిలో 194, నవల్పరాసి వెస్ట్‌బిలో 120, గూర్ఖాలో 58, నువాకోట్‌బిలో 52, ధాడింగ్‌బిలో 50, తున హున్‌బిలో 37, రుసువాలో 13 మంది ప్రాణాలు కోల్పో యారు. కాగా, నేపాల్ వరదల్లో ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు అయ్యారనీ, అందులో నేపాల్ పౌరులు ఉన్నారని ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ పేర్కొంది. గుర్తు తెలియని మృతదేహాలను గుర్తించే ప్రక్రియ కోసం, వాటిని దేశవ్యాప్తంగా 21 ఆస్పత్రులలో భద్రపరిచినట్టు వివరిం చింది. ప్రస్తుతం 239 మంది క్షతగాత్రులు ఆస్ప త్రులలో చికిత్స పొందుతున్నారని పేర్కొంది. మరోవైపు 20వేల మంది భద్రతా సిబ్బంది భూమార్గం ద్వారా ఇప్పటివరకు మొత్తం 8,730 మందిని సురక్షిత ప్రాం తాలకు చేర్చారు. వైమానిక సిబ్బంది 363 హెలికాప్టర్ ట్రిప్పుల ద్వారా 236 మంది విదేశీయులతో సహా 3,081 మందిని సురక్షితంగా బయటకు తీసుకొ చ్చారు. వరదల్లో చిక్కుకున్న ఒక హైడ్రోపవర్ టన్నెల్ నుంచి 279 మందిని రక్షించారు. మరోవైపు శిథిలాల కింద ఉన్నవారిని రక్షించేందుకు భారత్, చైనా స్పెషల్ రెస్క్యూ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా, గుర్తుపట్ట లేనంతగా ఛిద్రమైన మృత దేహాలకు డీఎన్ఏ పరీక్షలు, సామూహిక అంత్య క్రియలతో నేపాల్‌లో హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి.

# దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

(మొదటి పేజి తరువాయి)

నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ పకటించింది.

దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,111 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2.73 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,65,980 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పరీక్షల నిర్వహణ ప్రక్రియ అత్యంత భద్రత నడుమ, సజావుగా సాగిందని ఎన్‌బీఈఎంఎస్ ఒక ప్రకటనలో సంతృప్తి వ్యక్తం చేసింది.పరీక్షల నిర్వహణ దేశవ్యాప్తంగా సజావుగా సాగినప్పటికీ, జైపూర్‌లోని ఒక కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అక్కడ పరీక్ష రాస్తున్న 2,445 మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రభావిత విద్యార్థుల కోసం సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ స్పష్టం చేసింది. అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు తెలిపింది. వారికి పరీక్షా కేంద్రం వివరాలు త్వరలోనే తెలియజేస్తామని హామీ ఇచ్చింది.

పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్‌బీఈఎంఎస్ భారీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 16 ప్రాంతీయ కమాండ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 2,527 మంది ఫ్యాకల్టీ సభ్యులను ఇండిపెండెంట్ అబ్జర్వర్లుగా నియమించారు. అదనంగా, 700 మందికి పైగా డీన్లు, డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. అన్ని పరీక్షా కేంద్రాలను లైవ్ సీసీటీవీ నిఘాలో ఉంచారు. వీటిని ఢిల్లీ ద్వారకలోని ఎన్‌బీఈఎంఎస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. ఈ రియల్-టైమ్ నిఘా కోసం ఎన్‌బీఈఎంఎస్, టీసీఎస్‌కు చెందిన 190 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పనిచేసింది.

పరీక్షల నిర్వహణ విజయవంతం కావడం వెనుక భాగస్వాములైన వైద్య సంస్థలు, ఫ్యాకల్టీ, భద్రతా ఏజెన్సీలు, టెక్నాలజీ బృందాల సమన్వయం ఉందని ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. అభ్యర్థులు చూపిన సహనానికి, విశ్వాసానికి ధన్యవాదాలు తెలుపుతూ, పరీక్షల నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరి కృషిని అభినందించింది.

# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..

(మొదటి పేజి తరువాయి)

కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు.ఈ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి కృష్ణమ్మ జలాలు దూసుకువస్తాయని, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు తొడుగుతాయని అన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 'వెలిగొండ పండుగ' వద్ద కలుద్దామంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.



## వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ విజయవంతం..

**హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్న కృష్ణా జలాలు..**

ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాల దశాబ్దాల సాగు, తాగునీటి కలను సాకారం చేసే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించి అధికారులు ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో కరవు సీమలో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఆదివారం ఉదయం అధికారులు కొల్లం వాగు వద్ద ప్రాజెక్టు గేట్లను ఎత్తి సొరంగ మార్గంలోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గేట్ల పనితీరు,



సొరంగంలో నీటి ప్రవాహ వేగాన్ని, నీటి తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. సొరంగంలో పరుగులు తీసిన కృష్ణా జలాలు గంటవానిపల్లి క్రాస్ హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా రెగ్యులేటర్ వద్ద సైరన్ మోగించి సమీప ప్రజలను అప్రమత్తం చేశారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీశైలం జలాశయం ముందు భాగం నుంచి సుమారు 43.5 టీఎంసీల కృష్ణా వరద జలాలను తరలించి, నల్లమల సాగర్‌లో నిల్వ చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించనున్నారు. ముఖ్యంగా మార్కాపురం వంటి పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల నీటి కష్టాలకు ఈ ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం లభించనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

# హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం

**హైదరాబాద్,మన జన ప్రగతి ఆగస్టు 30:** హైదరాబాద్‌లోని అజామాబాద్ పారిశ్రామిక వాడలో గల రూ.500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే యత్నాన్ని విరమించుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధీనంలో ఉన్న భూమిని సదరు సంస్థకు కాకుండా ఇతరులకు అప్పనంగా ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బహిరంగ మార్కెట్లో వందల కోట్ల విలువ గల భూమిని కాంగ్రెస్ పార్టీకి చెందిన అనుయాయులకు తక్కువ ధరకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెనక్కి తీసుకోవాలన్నారు. మూడు దశాబ్దాలుగా ఆయిల్‌ఫెడ్ ఆధీనంలో 3 ఎకరాల 23 గుంటల భూమి ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.87 కోట్లు చెల్లించడానికి సొంత ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నా, వారిని కాదని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడం వెనుక దాగిన కుట్రను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కార్ రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయిందని విమర్శించారు. 1987లోనే సుప్రీంకోర్టు ప్రయివేట్ సంస్థకు మొట్టికాయలు వేసి ప్రభుత్వానిదే హక్కు అని తేల్చినా కమీషన్ల కోసం కాంగ్రెస్ నేతలు తీర్పులనే తుంగలో తొక్కారని లేఖలో పేర్కొన్నారు. ఒక్క అజామాబాద్ అనే కాకుండా కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలిలోనూ కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ దందా నడిపిస్తోందని ఆరోపించారు. స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా ఆస్తులు అమ్ముకుంటూ పోతే భవిష్యత్‌లో గుడికి, బడికి, చివరికి స్మశానానికి కూడా రాష్ట్రంలో స్థలం మిగలదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ అక్రమ కేటాయింపును రద్దు చేసి, ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల సొత్తును ప్రయివేట్ వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

# 77వసారి ఢిల్లీకి సీఎం రేవంత్

● మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మంతనాలు

**హైదరాబాద్,మన జన ప్రగతి ఆగస్టు 30:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు ఢిల్లీ వెళ్తున్నారు. సెప్టెంబర్ 3వ తేదీన ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్తారని సీఎం కార్యాలయం మీడియాకు లీకులు ఇచ్చింది. సీఎం ఢిల్లీకి వెళ్లడం ఇది 77వ సారి. సీఎం వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా వెళ్తారని చెప్తున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ క్రమశిక్షణ వంటి అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో వీరు చర్చిస్తారని తెలిసిందిమంత్రివర్గ విస్తరణ మీద చర్చలు జరుగుతాయని సీఎంవో కార్యాలయం లీకులు వదిలింది. దీనిని అధికారిక పర్యటనగా చెప్పుకొనేందుకు రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలు, పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల విడుదల అంశాలపై సీఎం పలువురు కేం ద్ర మంత్రులతో భేటీ అయ్యేందుకు సమయం కోరినట్టు చెప్తున్నారు

# మొక్కలు నాటే లక్ష్యం 91 శాతం పూర్తి

**హైదరాబాద్,మన జన ప్రగతి ఆగస్టు 30:**

రాష్ట్ర వ్యాప్తంగా వనమహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, పచ్చని రాష్ట్రంతో పాటు ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో చేపట్టిన వనమహోత్సవ పురోగతిపై ఆదివారం సమీక్షించారు. కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మితో కలిసి జిల్లాల వారీగా మొక్కలు నాటడం, ఇంటి ఆవరణల్లో మొక్కల పంపిణీ, గుంతల తవ్వకం, మొక్కల మనుగడపై ఈ సమీక్షలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది శాఖ పరిధిలో 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీంతో లక్ష్యంలో 91 శాతం మేర మొక్కల నాటడం పూర్తయిందని తెలిపారు. గుంతల తవ్వకంలో కూడా 92 శాతం పురోగతి సాధించినట్లు వెల్లడించారు. జిల్లాల పనితీరును సమీక్షించిన మంత్రి సీతక్క, నిర్దేశించిన లక్ష్యాల సాధనలో అధికారులు చూపుతున్న చొరవపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా వర్షాలు అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని మంత్రి స్పష్టం చేశారు.నాటిన ప్రతి మొక్క బతికి ఎదగడమే వనమహోత్సవం అసలు విజయమని అన్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, సంరక్షణ చర్యలు చేపట్టడం, మనుగడను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా ఇంటి ఆవరణల్లో నాటేందుకు పెద్ద ఎత్తున మొక్కలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పండ్ల మొక్కలను ప్రతి కుటుంబానికి చేరవేసే కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ ఏడాది 2.75 కోట్ల పండ్ల మొక్కలను పంపిణి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో పండ్ల మొక్క పెంచడం అంటే కేవలం పచ్చదనం పెంచడం మాత్రమే కాదు.. కుటుంబ ఆరోగ్యానికి పెట్టుబడి పెట్టడం కూడా అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. జామ, ఉసిరి, మామిడి, సీతాఫలం, మునగ వంటి పండ్ల మొక్కలను ఇంటి వద్ద పెంచుకోవడం ద్వారా కుటుంబ సభ్యులకు తాజా, సహజమైన పోషకాహారం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్రతి ఇంట్లో పండ్ల మొక్క, ప్రతి గ్రామంలో విస్తారమైన పచ్చదనం ఉండేలా ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

# కూకటికొండ అంగన్వాడీ కేంద్రంపై వచ్చిన ఆరోపణలపై విచారణ

### - పరిశీలించిన సిడిపిఓ మద్దమ్మ,సూపర్వైజర్ శివలింగమ్మ.



**దేవనకొండ మన జన ప్రగతి ఆగస్టు 30:** –దేవనకొండ మామండలం కూకటికొండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదంటూ గతంలో వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆస్పరి ప్రాజెక్టు సీడీపీఓ మద్దమ్మ. సూపర్వైజర్ శివలింగమ్మ విచారణ చేపట్టారు. కూకటికొండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సీడీపీఓ, అక్కడ పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్, ఆయాతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కేంద్రంలో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతూ తమ బాధ్యతలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో వచ్చిన కొన్ని ఆరోపణలు విచారణలో ఆవాస్తవం కాదని సీడీపీఓ మద్దమ్మ స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందాల్సిన సేవలు సక్రమంగా అందేలా సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. కేంద్రాల పనితీరుపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. అలాగే కూకటికొండగ్రామ ప్రజలు ఆవాసం కాదని తెలిపారు.

# నీట్‌పీజీ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 30:** –నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్‌పీజీ) పరీక్ష సందర్భంగా కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం వేర్వేరుగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు, అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించగా, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణపై ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎస్పీ కర్నూలులోని డా. కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష పూర్తయ్యే వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రవేశ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు అన్ని కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేద్దాశీ

### - మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సమావేశంలో వక్తలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 30:** ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక గీతా మందిరంలో పులివెందుల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సమావేశం కార్యదర్శి బి. గురుప్రసాద్ అధ్యక్షతన ఆదివారం ఘనంగా జరిగింది. రిటైర్డ్ జేటీవో రామిరెడ్డి ప్రార్థనా గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన కెనరా బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ ఏ.రామచంద్రారెడ్డి,ఇంగ్లీష్ అకాడమీ డైరెక్టర్ బి.మైసూరారెడ్డి మాట్లాడుతూ మానవత సంస్థ ప్రజల్లోకి వెళ్లి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తాను గత 15 సంవత్సరాలుగా ఎలాంటి వేతనం ఆశించకుండా వృద్ధాశ్రమ నిర్వహణను చేపట్టిన అనుభవాలను పంచుకున్నారు. మానవత అధ్యక్షులు చెవ్వ కృష్ణారెడ్డి, కార్యదర్శి గురుప్రసాద్, కోశాధికారి బి. హరిచంద్రారెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థుల్లో మానవీయ విలువలు పెంపొందించడం,రక్తదాన శిబిరాలు,శాంతి ర్యాలీల నిర్వహణ వంటి గత కార్యక్రమాలను వివరిస్తూ భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. స్నేహిత అమృత హస్తం సంస్థ అధ్యక్షులు ముమ్మెల రాజు నేత్రదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం నేత్రదాన పోస్టర్లను సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి,పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఏవీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హాజరైన సభ్యులకు రిటైర్డ్ ఈఈ గంగిరెడ్డి అల్పాహార వితరణ చేశారు.

# కడప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైయస్సార్ సిపి మండల నేత పెడబల్లి గణేష్ రెడ్డి మృతికి రెడ్యం సంతాపం

### - మంచి మనిషి,గణేష్ రెడ్డి మృతికి అత్యంత బాధాకరం:రెడ్యం



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 30:** –చెన్నూరు రెడ్డి వీధికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పెడబల్లి గణేష్ రెడ్డి (66) అనారోగ్యంతో హైదరాబాదులోని వారి కుమార్తె స్వగృహంలో ఆదివారం తెల్లవారుజామున మరణించారు. గణేష్ రెడ్డి మృత దేహాన్ని వారి స్వగృహం చెన్నూరుకు తెచ్చారు. వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆదివారం మధ్యాహ్నం గణేష్ రెడ్డి స్వగృహంలో ఆయన మృతదేహంపై పూలమాలవేసి ఘన నివాళి అర్పించి, ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తపరిచారు. పెడబల్లి గణేష్ రెడ్డి తమ్ముడు డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ పెడబల్లి ప్రతాపరెడ్డి, కుమారుడు పెడబల్లి ప్రదీప్ రెడ్డిని పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పారు. మంచి మనిషి, నిజాయితీ, నిబద్ధత కలిగిన గణేష్ రెడ్డి నాకు చిరకాల మిత్రుడని ఆయన మృతి అత్యంత బాధాకరమని. మృతుని తాను జీర్ణించుకోలేక పోతున్నానని రెడ్యం ఆవేదన వ్యక్తపరిచారు.

# నేతగుట్లపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ బాధిత రైతులకు న్యాయం చేయాలి

### - ఏపీ రైతుసంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 30:** –అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం, పుంగనూరు మండలంలోని నేతగుట్లపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రంగారెడ్డి రైతులతో కలిసి ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ప్రాజెక్టు నిర్మాణంవల్ల తమకు జరిగిన ఇబ్బందులను, అన్యాయాన్ని రంగారెడ్డితో వివరించారు. 202122 సంవత్సరంలో రిజర్వాయర్ ప్రాజెక్టు పనులు ప్రారంభించిన సమయంలో ప్రాజెక్టు కిందవున్న వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పటికి, నష్టపరిహారం విషయంలో రైతులకు ఇచ్చిన హామీలు ఇప్పటికి అమలు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రాజెక్టుకోసం భూములు కోల్పోయిన రైతులకు అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎకరాకు రూ.14 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని వారు రంగారెడ్డికి తెలిపారు. అయితే దాదాపు నాలుగు సంవత్సరాలు గడిచినా నష్టపరిహారం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులతో కలిసి మదనపల్లె కలెక్టరేట్‌కు చేరుకున్న రంగారెడ్డి సంబంధిత అధికారులను కలిసి రైతుల సమస్యలను వివరించారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందించడంతోపాటు వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. భూములు కోల్పోయిన రైతులు ప్రస్తుతం సాగు చేసుకునేందుకు భూమిలేక, ఉపాధి అవకాశాలులేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రంగారెడ్డి సబ్ కలెక్టర్ కు తెలిపారు. అప్పులుచేసి జీవనం సాగిస్తున్న రైతుల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. అనంతరం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ రైతులకు న్యాయం జరగకపోతే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులపక్షాన పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, లేనిపక్షంలో రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు మోహన్ నాయుడు, గూడెం మాజిసర్పంచ్ శ్రీనివాసులు, కిష్టప్ప, బాలకృష్ణ, వెంకట్ రెడ్డి, రైతులు హాజరు కావడం జరిగింది.

# కప్పట్రాలలో ఘనంగా ఆకే రవికృష్ణ ఐపీఎస్, ఐజీ జన్మదిన వేడుకలు

### తలసేమియా బాధితుల కోసం 30 మంది యువత రక్తదానం

### గ్రామాభివృద్ధికి ఆకే రవికృష్ణ కృషి అభినందనీయం:సీఐ వేణుగోపాల్



**దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 30:** –కప్పట్రాల గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఆకే రవికృష్ణ ఐపీఎస్, ఐజీ జన్మదిన వేడుకలను గ్రామ ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీశక్తి భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆకే రవికృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా దేవనకొండ మండల సీఐ వేణుగోపాల్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కప్పట్రాల గ్రామానికి చెందిన 30 మంది యువకులు రక్తదానం చేశారు. కర్నూలు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధితుల అవసరాలకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ కప్పట్రాల గ్రామం అభివృద్ధి చెందడంలో ఆకే రవికృష్ణ ఐపీఎస్, ఐజీ కృషి ఎంతో ఉందన్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుని విద్య, మహిళా సాధికారత, రైతుల అభివృద్ధి, యువతకు మార్గనిర్దేశం వంటి పలు రంగాల్లో మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. గ్రామం నుంచి ఇప్పటికే ఎనిమిది మంది ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించగా, సుమారు 70 మంది ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో పయనిస్తున్నారని అన్నారు. కప్పట్రాల గ్రామంలో సీసీ రోడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్, శ్రీశక్తి భవనం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళ్యాణ మండపం తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని సీఐ పేర్కొన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు మహిళా సంఘాలను ప్రోత్సహించడం, రైతులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామస్తులు ఐజీ ఆకే రవికృష్ణతో వర్చువల్‌గా మాట్లాడి జన్మదిన కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గ్రామస్తులు స్వీట్లు పంపిణీ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ యువకుడు గిరిబాబు ఆకే రవికృష్ణ సేవలను వివరిస్తూ ప్రత్యేకంగా రచించిన పాటను విడుదల చేశారు. **గ్రామాన్ని ఎప్పటికీ మరువను: ఆకే రవికృష్ణ** వర్చువల్ సమావేశంలో ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ కప్పట్రాల గ్రామాన్ని ఎప్పటికీ మరువనని అన్నారు. గ్రామంలోని రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత బాగుండాలని ఆకాంక్షించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. మహిళలు మహిళా సంఘాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెంది లక్షాధికారులుగా ఎదగాలని, రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా కొనసాగించాలని ఆకాంక్షించారు. త్వరలో కప్పట్రాల గ్రామానికి వచ్చి గ్రామస్తులను కలుసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ జ్యోతి సీఈఓ బి. నారాయణ, గ్రామ జ్యోతి అధ్యక్షురాలు భవాని, కప్పట్రాల గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు అంజనమ్మ, కప్పట్రాల మల్లికార్జున, సురేంద్ర నాయుడు, రవి, చింతామను రవికుమార్, చాకలి లక్ష్మన్న, వారం వెంకటరమణ, గొర్ల సుంకన్న, పాపన్న, విద్యపోగు సుంకన్న, సుధాకర్, జ్యోతి, సరిత తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువత భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాధ్యం

### • భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్




**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 30:** –యువత భాగస్వామ్యం తోనే వికసిత్ భారత్ సాధ్యమౌతుందని దేశ ప్రధాని నరేంద్రమోడీ అన్నట్లు భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీ నుంచి టెలివిజన్ల ద్వారా మనసులో మాట (మాన్ కి బాత్) కార్యక్రమం పేరిట దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని భాజపా నేత గాలి హరిప్రసాద్ తమ పార్టీ నేతలతో కలిసి టీవీల ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావడంలో ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలనే సందేశాన్ని ప్రధానమంత్రి ఇచ్చారన్నారు. ముఖ్యంగా నషాముక్త యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, నషాముక్త భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ప్రధాని పిలుపునిచ్చారని ఆయన పేర్కొన్నారు. నషాముక్తి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువత కొత్త కంటెంట్, పాటలు, నినాదాలు రూపొందించాలని సూచించారన్నారు. అదేవిధంగా వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రధాని గుర్తుచేశారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా చిన్న వ్యాపారులు, కళాకారులు, పారిశ్రామికవేత్తలు మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని ప్రధాని తెలిపారన్నారు. మహిళా సాధికారతకు పిఎం స్వనిధి పథకం అందిస్తున్న అవకాశాలను కూడా ప్రధానమంత్రి ప్రస్తావించారన్నారు . ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మహిళలు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారని ప్రధాని వెల్లడించారని ఆయన తెలిపారు. భారతదేశ చరిత్రపై యువతలో మరింత ఆసక్తి పెంచేందుకు ఉపయోగపడే కొత్త డిజిటల్ వేదిక గురించి కూడా ప్రధాని వివరించారన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలను వివిధ కాలాల్లో ఎవరు పాలించారు అనే చారిత్రక సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఈ వేదిక ద్వారా లభిస్తుందని ఆయన తెలియజేశారన్నారు రైతులకు కొత్త ఆదాయ అవకాశాలపై కూడా ప్రధాని దృష్టి సారించాలని ప్రధాని సూచించారన్నారు. ముఖ్యంగా ఆవకాడో సాగుకు పెరుగుతున్న డిమాండ్‌ను ప్రస్తావిస్తూ, కొత్త పంటలు మరియు మార్కెట్ అవకాశాలను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారన్నారు . ఆంధ్రప్రదేశ్ రైతులకు కూడా ఆవకాడో సాగు కొత్త అవకాశాలను కల్పిస్తోందని పేర్కొన్నారు. స్వచ్ఛత, సామాజిక బాధ్యత, యువత భాగస్వామ్యం, మహిళా సాధికారత, స్థానిక ఉత్పత్తుల ప్రోత్సాహం వంటి అంశాలను ప్రజల ముందుకు తీసుకురావడం ద్వారా 'మన్ కీ బాత్'జన్ కి బాత్ లా మారి మరోసారి ప్రజా భాగస్వామ్యంతోనే వికసిత భారత్ సాధ్యమని ప్రధాని ఇచ్చిన సందేశాన్ని అందరికీ అందించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవియాదవ్,నామ ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు (31వ తేదీ) పీజీఆర్ఎస్ కార్యక్రమం



**కడప టౌన్ మన జనప్రగతి ఆగస్టు 30:-**

జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ సభాభ వన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిం చనున్నట్లు డీఆర్వో మల్లికార్జునుడు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, పాత అర్జీలకు సంబంధించిన రసీదు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడమే జగన్ అజెండా



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 30:-**స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడమే వైసీపీ అధినేత జగన్ అజెండాగా కనిపిస్తోందని జనసేన రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ విమర్శించారు. ఆదివారం సిద్ధవటం మండల కేంద్రంలోని ఆకుల వీధిలో తన నివాసంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కొన్ని నియోజకవర్గాల్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని బలవంతంగా ఏకగ్రీవాలు చేయించిన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. 202021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గంలోని 85 పంచాయతీలకు 85 ఏకగ్రీవాలు కాగా, మాచర్ల నియోజకవర్గంలోని 77 పంచాయతీలకు 74 ఏకగ్రీవాలు జరిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో ఏకగ్రీవాలను ప్రోత్సహించిన వైసీపీ.. ఇప్పుడు ఏకగ్రీవాలు జరుగుతుండటాన్ని తప్పుబట్టడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పుడు ఒప్పయిన ఏకగ్రీవాలు ఇప్పుడు ఎలా తప్పవుతాయని అతి కారి కృష్ణ ప్రశ్నించారు.

## కారుద్విచక్ర వాహనం ఢీ..యువకుడికి తీవ్ర గాయాలు



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 30:-**మండలంలోని భాకరాపేట సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం మధ్యాహ్నం కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బద్వేల్ సుందరయ్య కాలనీకి చెందిన వెంకట సుబ్బారెడ్డి ద్విచక్ర వాహనంపై రాజంపేట వైపు నుంచి వెళ్తుండగా.. బద్వేల్ నుంచి నందలూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన ఎడమ పాదానికి తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. సమాచారం అందుకున్న సిద్ధవటం ఎస్సై హారిక ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై విచారణ చేపట్టారు.

## శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



**శేరిలింగంపల్లి మన జనప్రగతి ఆగస్టు 30:-** శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి మరియు భరత నాట్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి.శృతి స్వర్ణకార మరియు వేదప్రియలు భరతనాట్య ప్రదర్శనలో జతిస్వరం, అష్టకం, కీర్తనం,తిల్లాన అంశాల తో అలరించారు. పంచమవేద నాట్య నిలయం గురువు కనకదుర్గ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఝుమ్ ఝుమ్ తనన,బ్రహ్మాంజలి,శివ పంచాక్షరీ,అదిగో అల్లదిగో,రుక్మిణి ప్రవేశం,బాలగోపాలా తరంగం అంశాలను శారదవల్లి,అభిజ్ఞ,పర్ణిక, తేజస్విని,దీత్య, అపేక్ష,కృతిక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## పిజిఆర్ఎస్ సేవలపై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

**• జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**




**కడప,మన జనప్రగతి ఆగస్టు 30:-** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


## పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ వివాహ వేడుకల్లో సందడి



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 30:-**పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ పలు ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. డోన్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి కుమార్తె వివాహం కర్నూలులోని జీఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో, క్రిష్ణగిరి మండలం టి.గోకులపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ పార్టీ నాయకుడు పూల సుంకన్న కుమార్తె వివాహం, వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వైఎస్సార్ పార్టీ నాయకుడు బాల మద్దయ్య కుమారుడి వివాహం గోవర్ధనగిరిలో జరిగాయి. అలాగే మద్దికేర మండలం పెరవలి గ్రామానికి చెందిన వైఎస్సార్ పార్టీ మాజీ వార్డు మెంబర్ మానుకింద రంగస్వామి కుమారుడి వివాహం, పత్తికొండ పట్టణ వైఎస్సార్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్‌రెడ్డి వివాహం పత్తికొండలోని ఎం. కన్వెన్షన్‌లో, పత్తికొండ మండలం హోసూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ పార్టీ నాయకుడు భీమ తమ్ముడి వివాహం హోసూరులో, క్రిష్ణగిరి మండలం మన్నెకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ పార్టీ నాయకుడు పెద్దకురువ రాముడు కుమారుడి వివాహం కూడా జరిగింది. ఈ వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఆమె వెంట వెల్దుర్తి, మద్దికేర, పత్తికొండ, క్రిష్ణగిరి మండలాలకు చెందిన వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రయాణికురాలి బంగారు ఆభరణాల బ్యాగ్ అప్పగింత





**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 30:-**నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రయాణికురాలు మర్చిపోయిన బంగారు ఆభరణాలున్న బ్యాగ్‌ను భద్రంగా తిరిగి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. విజయవాడ కాకినాడ బస్సులో ప్రయాణించిన ఓ మహిళా ప్రయాణికురాలు కాకినాడ వైఎస్సార్ సర్కిల్ వద్ద దిగిన తర్వాత బ్యాగ్‌ను బస్సులోనే మర్చిపోయినట్లు గుర్తించారు. దీంతో ఆమె వెంటనే కాకినాడ డిపోకు చేరుకుని సిబ్బందికి విషయం తెలిపారు. డిపో సిబ్బంది సంబంధిత బస్సును తనిఖీ చేయగా బ్యాగ్ లభించింది. అందులో సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. బస్సు డ్రైవర్ బిఎస్ఎస్ వాసు, భద్రతా సిబ్బంది, విధుల్లో ఉన్న నియంత్రణాధికారి సమక్షంలో బ్యాగ్‌ను సంబంధిత మహిళకు అప్పగించారు. విలువైన వస్తువులను భద్రంగా కాపాడి, ఎలాంటి స్వార్థం లేకుండా తిరిగి అప్పగించిన డ్రైవర్ వాసు నిజాయితీ, నిబద్ధతను డిపో మేనేజర్, సహాయ మేనేజర్ అభినందించారు. ప్రయాణికుల వస్తువుల భద్రత విషయంలో ఆర్టీసీ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న తీరుకు ఈ ఘటన నిదర్శనమని వారు పేర్కొన్నారు.

## ఘనంగా ముగిసిన భాగవత సప్తాహ పఠనం



**వీరపునాయనపల్లి మన జనప్రగతి ఆగస్టు 30:-** కడప జిల్లా వీరపునాయనపల్లి శ్రీ రామస్వామి ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహ పఠనం ఆదివారం ఘనంగా ముగిసింది. చివరి రోజు పఠనం అనంతరం ఏడు రోజులపాటు ఏడు మంత్రాలను 'మంత్ర పుష్పం' పేరుతో జపించారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయం చుట్టూ 'ఓం నమో భగవతే వాసుదేవాయ' మంత్రాన్ని జపిస్తూ కలశ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలోని సంగమేశ్వర దేవస్థానం సమీపంలోని నదిలో భాగవత పండితులు అవభృత స్నానాలు చేశారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. ఒకప్పుడు ఈ ప్రాంతానికి 'బాంబుల గడ్డ'గా పేరుండేదని, నేడు 'భాగవత గడ్డ'గా మారిందని పేర్కొన్నారు. పల్లెపల్లెలో భాగవత పఠనం నిర్వహిస్తూ ఆధ్యాత్మిక కుసుమాలను విరజిమ్ముతున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సరోజమ్మ కుమార్తె, అల్లుడు రామప్రసాదరెడ్డి దంపతులు భాగవత పండితులను ఘనంగా సత్కరించారు. ఏడు రోజులపాటు అన్నప్రసాదం వితరణ చేసిన దాతలకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి, నిర్వాహకులు రాధమ్మ, సరోజమ్మ, రాయలసీమ భాగవత భక్త సమాజం కన్వీనర్ యాగంటి బాలకృష్ణారెడ్డి, దర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల డ్రోన్ కెమెరా కన్ను




**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 30:-**చిట్వేలి మండలంలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో రైల్వే కోడూరు గ్రామీణ పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ చర్యలు చేపట్టారు. చిట్వేలి మండలంలోని మల్లెంపల్లి, జెట్టివారిపల్లి, తుమ్మకొండ గ్రామాలతో పాటు ఆయా గ్రామాల శివారు ప్రాంతాలు, అనుమానాస్పద ప్రదేశాలలో డ్రోన్ కెమెరాలను ఎగురవేసి విస్తృతంగా నిఘా నిర్వహించారు. ముఖ్యంగా పేకాట స్థావరాలు, కోడి పందేలు నిర్వహించే ప్రాంతాలు, గంజాయి నిల్వ లేదా వినియోగానికి సంబంధించిన అనుమానాస్పద ప్రదేశాలు, బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. డ్రోన్ నిఘా ద్వారా అనుమానాస్పద కదలికలు, ప్రదేశాలు గుర్తించిన వెంటనే స్థానిక పోలీసు సిబ్బంది స్పందించి, పరిస్థితులను పరిశీలించి అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా అవసరాన్ని బట్టి డ్రోన్ నిఘాను విస్తరించి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు చేపడతామని ఆయన అన్నారు. గ్రామాల్లో పేకాట, కోడి పందేలు, గంజాయి వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## తుర్క్ యూనివర్సిటీ ప్రశంసా పత్రాన్ని అందుకున్న పరిమళ జ్యోతి



**పోరుమామిళ్ల మన జనప్రగతి ఆగస్ట్ 30:-**రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల విద్యా విషయక అంశాల పరిశీలనకు సంబంధించి ఆగస్టు 17 నుండి ఫిన్లాండ్ లోని తుర్కు యూనివర్సిటీలో జరిగిన అంతర్జాతీయ పర్యటన కార్యక్రమం విజయవంతమైందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి తెలిపారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో రాష్ట్రం నుండి 29 మంది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ బృందం ఫిన్లాండ్ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే.. వెళ్ళిన బృందం ఈనెల 17వ తేదీ నుండి 26వ తేదీ వరకు శిక్షణా కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పలు విద్యావిధానాలపై పూర్తి అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో కాశి నాయన మండలం, రెడ్డి కొట్టాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ జి టి గా విధులు నిర్వహిస్తున్న హరిత ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ బండి పరిమళ జ్యోతిని తుర్కు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ , పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా సమక్షంలో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బండి పరిమళ జ్యోతి మాట్లాడుతూ...ఈ పర్యటన ఎంతో అనుభూతినిచ్చిందని ఇంతటి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర విద్యా శాఖా మాత్యులు నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రశాంత వాతావరణానికి సహకరించాలి




**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 30:-**గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా రౌడీషీటర్లు సహకరించాలని సిద్ధవటం ఎస్సై హారిక సూచించారు. ఆదివారం సిద్ధవటం పోలీస్‌స్టేషన్‌లో సిద్ధవటం, ఎస్.రాజంపేట గ్రామాలకు చెందిన ముగ్గురు రౌడీషీటర్లకు ఆమె కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై హారిక మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి గొడవలు, అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా శాంతిభద్రతలకు సహకరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో గొడవలు సృష్టించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
31- 08 - 2026

# దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**● కడపలో దళిత చైతన్య మహాసభ హలో దళిత..చలో కడప**



**కడప మన జనప్రగతి ఆగస్టు 30:**-జిల్లాలోని పేద దళితులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వి.ఆర్. శంకర్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో దళిత చైతన్య మహాసభ 'హలో దళిత.. చలో కడప' కార్యక్రమాన్ని నిర్వహించారు.సభకు అధ్యక్షత వహించిన వి.ఆర్. శంకర్ మాట్లాడుతూ.. భూమిలేని నిరుపేదలకు వ్యవసాయ భూములు పంపిణీ చేయాలని కోరారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఖాజీపేట, చెన్నూరు, సీకే దిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, కమలాపురం, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల్లో అర్హుల జాబితాలను అధికారులు పరిశీలించి కడప ఆర్‌డీఓ, జిల్లా కలెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. కొన్ని మండలాల్లో విచారణలు కొనసాగుతున్నాయని చెప్పారు.అర్హులైన పేదలకు త్వరితగతిన భూములు పంపిణీ చేసేందుకు అసైన్మెంట్ సమావేశం నిర్వహించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు సంఘం తరపున ప్రభుత్వానికి లేఖ పంపినట్లు తెలిపారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అసైన్మెంట్ సమావేశాలు నిర్వహించి భూమిలేని పేద దళితులకు వ్యవసాయ భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే దళితులకు 50 సంవత్సరాలకే పెన్షన్ అందించాలని, దళిత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి, సొంత వ్యాపారాల కోసం రుణ సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో అవ్వారు మల్లికార్జున, ఎస్వీ రమణ, వై. ప్రతాప్‌రెడ్డి, పీవీ రమణ, వై. మల్లేష్, బాల వీరప్ప, గాలివీడు నాగేశ్వరరావు, పెండ్లిమర్రి మల్లేష్, కమలాపురం లక్ష్మీదేవి, సిద్ధవటం రాజేశ్వరి, ఒంటిమిట్ట చంద్ర, చెన్నూరు నాగలక్ష్మి, సీకే దిన్నె లక్ష్మీనారాయణ, సంతోషమ్మ, కాజీపేట గుర్రమ్మ, బి. వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత పెడబల్లె గణేష్‌రెడ్డి మృతికి ప్రముఖుల సంతాపం



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 30:**-చెన్నూరు పట్టణంలోని రెడ్డివారి వీధికి చెందిన మాజీ కడప మార్కెట్ యార్డు చైర్మన్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత పెడబల్లె గణేష్‌రెడ్డి (66) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని తన కుమార్తె స్వగృహంలో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని చెన్నూరులోని స్వగృహానికి తీసుకువచ్చారు.గణేష్‌రెడ్డి మృతదేహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. గణేష్‌రెడ్డి వివాదరహితుడు, సహనశీలి, నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి, మండల పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. గణేష్‌రెడ్డి మృతి పార్టీకి, స్థానిక ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, గణేష్‌రెడ్డి కుటుంబానికి పార్టీ, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీ.ఎన్. భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివరామిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్. వెంకటసుబ్బారెడ్డి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మన్నెం సుబ్బారెడ్డి, రాధమ్మ, దేవగుడి భాస్కర్‌రెడ్డి, శివయ్య యాదవ్, ఓబుళంపల్లె చంద్ర, చల్లా వెంకట సుబ్బారెడ్డి బాబు, అన్వేష్‌రెడ్డి, టి.ఎ.ఎన్. చంద్ర, ఎంపీటీసీ చంద్ర, వెంకటరమణ, అల్లి శ్రీరామ మూర్తి, సాగర్, మిట్టా మాధవరెడ్డి, ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, శివారెడ్డి, కుమార్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నిత్య, శ్రీనివాసరాజు, నవాజ్, అన్వార్, రబ్, వారిస్, లక్షుమయ్య, కృష్ణ, కొండారెడ్డి, సంపూర్ణశ్ రెడ్డి, జగన్నాథం, రామాంజనేయులు తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కడప నగరాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం


**- కడప కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరాలి: డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 30:**- కడప నగర అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కడప కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరాలని రాజ్యసభ మాజీ సభ్యుడు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కడప నగర అధ్యక్షుడు గౌస్ పీర్,కడప నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అంజన్ కుమార్ ఆదివారం వేంపల్లి లో తులసి రెడ్డిని కలిసి రాబోవు కడప మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల గురించి సలహాలు, సూచనలు తీసుకున్నారు.ఈ సందర్భంగా తులసి రెడ్డి ని శాలువతో వారు ఘనంగా సత్కరించారు.అనంతరం తులసి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే కడప మున్సిపాలిటీ మున్సిపల్ కార్పొరేషన్ గా 2004 నవంబర్ 17న ఏర్పడిందని,కడప నగరాభివృద్ధి అంతా కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని,ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో కడప నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఇందులో భాగంగా కడపలో రిమ్స్ వైద్య కళాశాల,డెంటల్ కళాశాల,నర్సింగ్ కళాశాల ఏర్పాటు అయిందన్నారు. అలాగే కడపలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు,క్రికెట్ స్టేడియం,సెంట్రల్ స్కూల్, విమానాశ్రయం ఆధునికీకరణ,యోగి వేమన విశ్వవిద్యాలయం,శాటిలైట్ సిటీ,సింగపూర్ టౌన్షిప్,బుగ్గ వంకపై 4 హై లెవెల్ బ్రిడ్జిలు ఏర్పాటు,బుగ్గ వంక సుందరీకరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కాంగ్రెస్ పాలనలో అమలైన సంక్షేమ కార్యక్రమాలు సామాజిక న్యాయం గురించి ప్రజలకు వివరంగా చెప్పాలన్నారు.టిడిపి,వైకాపాలు దొందు దొందే అని,రాహుకేతువులన్నారు. వైకాపా అరచేతిలో వైకుంఠం చూపించగా, టిడిపి అరచేతిలో కైలాసం చూపిస్తుందన్నారు. ఈ రెండు పార్టీలది సవతుల పోరు తప్ప మరి ఏమీ కాదన్నారు.కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు,, సామాజిక న్యాయం గురించి విస్తృతంగా ప్రచారం చేస్తే ఖచ్చితంగా రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కడప నగర ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారన్నారు.

# కడప కార్పొరేషన్‌లో కాంగ్రెస్‌దే విజయం

**● ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం:బండి జకరయ్య**



**కడప మన జనప్రగతి ఆగస్టు 30:**-ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, రాబోయే కడప కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కడప అసెంబ్లీ కాంగ్రెస్ కోఆర్డినేటర్ బండి జకరయ్య ధీమా వ్యక్తం చేశారు.డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి ఆదేశాల మేరకు 43వ డివిజన్ కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమావేశాన్ని రవీంద్రనగర్‌లోని గంగమ్మ ఆలయం సమీపంలో నిర్వహించారు. దినకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బండి జకరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి జకరయ్య మాట్లాడుతూ 43వ డివిజన్‌లో నెలకొన్న వీధి దీపాలు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కడప నగర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందని, దీంతో నగరంలో పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని అన్నారు.దినకర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి లా కాలేజ్ వంతెన నిర్మాణం, డ్రైనేజీ సమస్య పరిష్కారం, బుగ్గవంక వరద రక్షణ గోడ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోనాల పండుగ మహోత్సవంలో పాల్గొన్న మారబోయిన రవి యాదవ్



**శేరిలింగంపల్లి మన జనప్రగతి ఆగస్టు 30:**- గోపి నగర్లో దుర్గామాత,పోచమ్మ తల్లి అమ్మ వారి బోనాల మహోత్సవంలో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.మారబోయిన రవి యాదవ్ తో కలసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక భక్తులు బోనాల మహోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనందదాయకమని నాయకులు పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందాలి: మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి



**రామాపురం మన జనప్రగతి ఆగస్టు 30:**-రామాపురం మండలంలోని సుద్దమళ్ళ గ్రామం తొట్టివారిపల్లి లో ఆదివారం నూతనంగా నిర్మించిన సీతారామ సహిత ఆంజనేయ ఆలయాన్ని మాజీ శాసనసభ్యులు గడికోట మోహన్ రెడ్డి ప్రారంభించారు. దేవాదాయ-ధర్మాదాయ శాఖ నిధులు, గ్రామస్థులు సేకరించిన చందాల ద్వారా నిర్మించిన నూతన ఆలయాన్ని ఎంతో సుందరంగా నిర్మించారని మాజీ ఎమ్మెల్యే అన్నారు.గ్రామంతో పాటు మండలం పాడి పంటలతోటి అభివృద్ధి చెందుతూ శ్రీరాముని యొక్క కృపాకటాక్షాలు ఎల్లవేళలా ప్రజలందరికీ ఉండి చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేకు గ్రామస్తులు పూజారులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తొట్టివారిపల్లి వేణుగోపాల్ రెడ్డి,నాగశేఖర్ రెడ్డి,నరసింహలు,శ్రీరాములు,నరసింహులు,పిచ్చయ్య,రవి,రఘురామ్,రమణ,సురేష్,నరేష్,శంకర్,గోపాల్,సుబ్భాయ్య గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహా బాగ్యం

**- చిన్నతనం నుండే విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి: కమిషనర్ ఎం. జయకృష్ణ**




**తిరుపతి మన జనప్రగతి ఆగస్టు 30:**- ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని, చిన్న తనం నుండే విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ, అవగాహన పెంచుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ పిలుపనిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియం లో రెండు రోజులపాటు "ప్రివెంటివ్ హెల్త్ కేర్ అండ్ డిజిటల్ వెల్‌నెస్" అంశంపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేచురోపతి ద్వారా వ్యాధులను నివారించడం, డిజిటల్ యుగంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా "ఆరోగ్యమే మహాభాగ్యం" అని తెలిపారు. నేటి యువత మొబైల్, ల్యాప్‌టాప్ లకు అతుక్కుపోయి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని, దీనిని నివారించేందుకు యోగా, ప్రకృతి వైద్యం, సరైన జీవనశైలి ఎంతో అవసరమని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యాకరమైన జీవితం ప్రతి ఒక్కరికీ అందించాలనే సదుద్దేశ్యంతో ఇటువంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రెండు రోజులపాటు తిరుపతిలో సత్యనారాయణ రాజు నిర్వహించడం మనందరికీ ఎంతో ఆనందకరమని తెలిపారు. విద్యతో పాటు చిన్నతనం నుండి ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటేనే యువ భారత్ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి ఆరోగ్యాకరమైన సందేశాన్ని ఇంటింటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ అధికారులు, వైద్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 12 మంది కంటి రోగులకు ఆపరేషన్లు



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 30:**- రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 12 మంది కంటి రోగులకు ఆపరేషన్ లు నిర్వహించారు.ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట,రైల్వే కోడూరు,సుండుపల్లె,వీరబల్లి, యర్రావారిపాలెం,కేవీపల్లి,కలకడ,కలికిరి,పీలేరు,గుర్రంకొండ,పెద్దమండెం,ఎన్.పి.కుంట,చక్రాయపేట,కడప తదితర ప్రాంతాల నుండి వచ్చిన 45 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 12 మంది కంటి రోగులకు ఆపరేషన్ లు నిర్వహించారు.అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు,అద్దాలు పంపిణీ చేశారు.అనంతరం కంటి ఆపరేషన్ ల కోసం వచ్చిన కంటి రోగులతో పాటు వారి వెంట ఉన్న సహాయకులకు అన్నమయ్య జిల్లా పరిధిలోని గుర్రంకొండ మండలం నడిమి కండ్రిగ పంచాయతీలోని మొటుకు గ్రామానికి చెందిన దాత ఎన్నారై ఎర్రగొండ గోవర్ధన్ రెడ్డి ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి.ఆర్ స్వరూప్ గుప్తా,కోశాధికారి శివప్రసాద్ రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష,ఏపీఐఐసి మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి,కంటి వైద్యులు సురేష్ బాబు,ఆఫ్తాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# చెన్నూరు వైసీపీ సీనియర్ నాయకుడు పెడబల్లె గణేష్ రెడ్డి గుండెపోటుతో మృతి



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 30:**-చెన్నూరు మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కడప మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెడబల్లె గణేష్ రెడ్డి ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటలకు గుండెపోటుతో మృతి చెందాడు, మధ్యాహ్నం గణేష్ రెడ్డి చెన్నూరు స్వగృహానికి తీసుకొచ్చారు, గణేష్ రెడ్డి మృత్యువాత తెలుసుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు మృతదేహంపై పూలమాలవేసి ఇవాళ అర్పించారు,కమలాపురం శాసనసభ్యుడు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి,మాజీ శాసనసభ్యుడు పి రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు రెడ్డెం వెంకటసుబ్బారెడ్డి పలువురు నాయకులు కార్యకర్తలు నివాళులు అర్పించారు,

# వేంపల్లెలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 30:**-పట్టణం లోని కడప రోడ్డు హనుమాన్ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఒకరు ఆదివారం మృతి చెందారు. 35 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వయసు ఉన్న ఈ వ్యక్తి శనివారం రాత్రి నుంచే హనుమాన్ జంక్షన్ వద్ద ఉంటూ ఎక్కువ మద్యం సేవించి మద్యం మత్తులో అక్కడ పడిపోయారు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి అతనిపై నీళు కూడా పోశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అతను అక్కడే మృతి చెందారు. మృతుడి వంటిపై గులాబీ చెక్స్ షర్టు, నీలి రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నారని, బెల్ట్ పై సాధన హైస్కూల్ - కేడిఆర్ అనే పేరు ఉందని పోలీసులు తెలిపారు. ఇతని వివరాలు ఎవరికైనా తెలిస్తే సీఐ నరసింహులు 9121100550 నెంబర్కు గాని, ఎస్ఐ తిరుపాల్ నాయక్ 9440938046 నెంబర్కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలియజేశారు.

మన జనప్రగతి

31- 08 - 2026

# మిషనరీ చర్చి భూములను పరిరక్షించాలి: సీబీసీ కమిటీ డిమాండ్

**- భారీ నిరసన ర్యాలీ,అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్, అధికారులకు విజ్ఞప్తి**







**హనుమకొండ,మన జనప్రగతి ఆగస్టు 31:**మిషనరీ చర్చికి చెందిన విలువైన భూములను తక్షణమే పరిరక్షించాలని, ఆ స్థలాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి (CBC) హనుమకొండ కమిటీ బాధ్యులు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం హనుమకొండలోని చర్చి ప్రాంగణం నుండి అశోక జంక్షన్ వరకు కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మిషనరీ చర్చి భూములను వ్యక్తిగత, ఆర్థిక ప్రయోజనాల కోసం స్వార్థపరులు వినియోగించరాదని నిరసనకారులు పెద్దెత్తున నినాదాలు చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... ఏపీ హైకోర్టు పరిధిలో (కోర్టు వివాదంలో) ఉన్న మిషనరీ చర్చి భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. చర్చి భూములను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న మండల శ్రీనివాస్ రెడ్డిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మిషనరీలు, చర్చి సేవా కార్యక్రమాల కోసం కేటాయించిన భూములను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. చర్చి ఆస్తులపై ఎలాంటి అక్రమ ఆక్రమణలు, నిర్మాణాలు జరగకుండా జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. చర్చి భూముల పరిరక్షణ కోసం అవసరమైతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కమిటీ బాధ్యులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీబీసీ హనుమకొండ కమిటీ ప్రతినిధులు జి.జె. నిరంజన్ బాబు, ప్రెసిడెంట్ టి. క్రీస్టాఫర్ రూబెన్, సెక్రటరీ జి. విజయ్ స్వరూప్, ఉపాధ్యక్షులు విద్యాకర్, టి. మోజెస్ క్రిస్టాఫర్, ట్రెజరర్ బి. విజయ్ కుమార్, జాయింట్ సెక్రటరీలు జె. డానియేలు, జాన్సన్ ప్రసాద్, మత విశ్వాసకులు బోడ డిన్న, డా. పులి అనిల్ కుమార్, పాస్టర్ ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం




**వరంగల్, మన జనప్రగతి ఆగస్టు 31:** లయన్స్ క్లబ్ ఆఫ్ హెచ్ఎన్కె న్యూ శాయంపేట ఆధ్వర్యంలో న్యూ శాయంపేటలోని గ్రీన్ ఫీల్డ్ స్కూల్ లో ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ లయన్ ఎన్. సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కంటి వైద్య నిపుణులు డా. రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ వి. శ్యామ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జె. అశోక్ రెడ్డి, సెక్రటరీ ఎండి. ఉస్మాన్ పాషా, ట్రెజరర్ జూకంటి శ్రీనివాస్ (వాసు), జిల్లా కాంగ్రెస్ పీసీ మెంబర్ మామిండ్ల సురేష్ తో పాటు లయన్ సభ్యులు వలి మహమ్మద్, సురేందర్, నాగరాజు, జి. దశరథం, సోమన్న, రజనీకాంత్, కొల్లూరి కృష్ణ, ఇ. ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి.. ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలి

**- పదవుల కోసం కాదు.. ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి రావాలి: జింక వేణు**



**మల్లంపల్లి మండల ప్రతినిధి, మన జనప్రగతి ఆగస్టు 31:** యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో చురుకైన పాత్ర పోషించాలని జింక వేణు పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి యువత చేతుల్లోనే ఉందని, యువతలో ఉన్న శక్తి, ఆలోచనా సామర్థ్యం, నాయకత్వ లక్షణాలను సమాజ అభివృద్ధికి వినియోగించాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ సందర్భంగా జింక వేణు మాట్లాడుతూ.. రాజకీయాలు కేవలం పదవులు, అధికారం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే పవిత్ర వేదికగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచే యువత ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.**ప్రజా సమస్యలపై యువత గళమెత్తాలి**నిరుద్యోగం, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, మౌలిక వసతులు తదితర సమస్యలపై యువతకు పూర్తి అవగాహన ఉండాలని జింక వేణు అన్నారు. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.యువత సోషల్ మీడియా పోస్టులు, రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలతో కలిసి పనిచేయాలని అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిపై బాధ్యతాయుతంగా పోరాడితే ప్రజలకు న్యాయం చేయడంతో పాటు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు.**నిజాయితీ, నిబద్ధతతో ముందుకు సాగాలి**రాజకీయాల్లోకి వచ్చే యువతలో నిజాయితీ, నిబద్ధత, సేవాభావం తప్పనిసరిగా ఉండాలని జింక వేణు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించడమే నిజమైన నాయకత్వానికి కొలమానమని అన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసే యువ నాయకత్వం నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు."పదవి కోసం రాజకీయాల్లోకి రావద్దు.. ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి రావాలి. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పనిచేసే యువ నాయకత్వం నేటి సమాజానికి అవసరం" అని జింక వేణు అన్నారు.**ప్రతి గ్రామం నుంచి యువ నాయకత్వం రావాలి**ప్రతి గ్రామం నుంచి యువత ప్రజాసేవలోకి వచ్చి గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేయాలని ఆయన కోరారు. యువతలో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలపై ఉందన్నారు.యువత రాజకీయాల్లోకి రావడం వల్ల కొత్త ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజా సమస్యలపై కొత్త విధానాలు ముందుకు వస్తాయని తెలిపారు. అవినీతి, నిర్లక్ష్యం, సమస్యలను పట్టించుకోని ధోరణికి వ్యతిరేకంగా యువత ప్రజల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని, నేటి యువత రేపటి నాయకత్వంగా ఎదిగి సమాజానికి దిశానిర్దేశం చేయాలని జింక వేణు ఆకాంక్షించారు. యువత ముందుకు వస్తేనే రాజకీయాల్లో కొత్త ఆలోచనలు, కొత్త నాయకత్వం, కొత్త మార్పులు సాధ్యమవుతాయని ఆయన తెలిపారు.

# పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

**- బోనాల పండుగకు పోటెత్తిన భక్తులు.. మొక్కులు చెల్లించుకున్న భక్తజనం**



**ఏటూరునాగారం, మన జనప్రగతి ఆగస్టు 31:**ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపురం పోచమ్మ తల్లి ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.తెలంగాణ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పాటిస్తూ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను అందంగా అలంకరించి పోచమ్మ తల్లికి సమర్పించారు.'తల్లి.. మా పంటలు బాగా పండాలి.. మా పిల్లలను చల్లగా చూడాలి.. మా కుటుంబాలను, మా ఊరిని సుఖసంతోషాలతో కాపాడాలి' అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ముఖ్యంగా రైతులు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రత్యేకంగా ప్రార్థించారు.ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు, మహిళలు, చిన్నారులు కుటుంబ సమేతంగా ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పాఠశాలలకు సెలవు కావడంతో పిల్లలు సైతం పెద్ద సంఖ్యలో ఆలయానికి రావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. బోనాల పండుగ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తి వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ప్రధాన పూజారి బల్ల భద్రయ్య గారు కర్తగా వ్యవహరించారు. ఆయన ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ఆకాంక్షించారు.

# రాజకీయం అయిపోయింది.. ఇక అభివృద్ధే మా లక్ష్యం

**బురదజల్లే రాజకీయాలు మాని అభివృద్ధికి సలహాలు ఇవ్వండి**

**ప్రతిపక్ష కౌన్సిలర్లకు పుర చైర్మన్ ధరవత్ మోహన్ నాయక్ సూచన**



**కల్లూరు, మన జనప్రగతి ఆగస్టు 31:** ఎన్నికలు ముగిసి దాదాపు ఐదు నెలలు గడిచిందని, ఇక రాజకీయాలకు స్వస్తి పలికి కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని కల్లూరు పుర చైర్మన్ ధరవత్ మోహన్ నాయక్ పిలుపునిచ్చారు.కల్లూరు మున్సిపాలిటీలో ప్రతిపక్ష పార్టీలు తమ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడం లేదని, అభివృద్ధి పనులు తమకు సమాచారం ఇవ్వకుండా చేపడుతున్నారని పదేపదే ఆరోపించడం పూర్తిగా అసత్యమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రోజునే ఎన్నికలు, రాజకీయాలు ముగిశాయని, ఇకపై అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసినట్లు మోహన్ నాయక్ తెలిపారు. ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు గెలిచిన వార్డుల్లో కూడా ప్రజల ఆమోదంతో వారు ఎన్నికయ్యారని, ఆయా వార్డుల అభివృద్ధిలో వారికి పూర్తి ప్రాధాన్యత ఉంటుందని మొదటి నుంచే చెప్పామని, అదే విధంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. ప్రతిపక్ష కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా, మున్సిపల్ ప్రోటోకాల్‌ను పాటించకుండా ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టలేదని స్పష్టం చేశారు. ప్రజలకు అధిక ప్రయోజనం చేకూరే పనులకే ప్రాధాన్యత ఇస్తున్నామని, సంబంధిత ప్రజాప్రతినిధులకు సమాచారం అందించిన తర్వాతే పనులు చేపడుతున్నామని తెలిపారు. తాను గతంలో బాధ్యతాయుతమైన సర్పంచ్ పదవిలో పనిచేసి ప్రస్తుతం పుర చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నానని, గ్రామీణ, పట్టణ పాలనలోని సమస్యలు, అభివృద్ధి అవసరాలపై పూర్తి అవగాహన ఉందని మోహన్ నాయక్ అన్నారు.పదేపదే రాజకీయాలు చేయడం, ఆరోపణలు చేయడం, బురదజల్లడం మానుకోవాలి అన్నారు. కల్లూరు అభివృద్ధికి సహకరించాలని విమర్శల కంటే మంచి సలహాలు, సూచనలు ఇస్తే వాటిని స్వాగతిస్తాం అని ఆయన పేర్కొన్నారు. నిజంగా కల్లూరు అభివృద్ధిని కోరుకునే వారైతే స్థానిక ఎమ్మెల్యే, కల్లూరు ప్రాంతానికి చెందిన మంత్రి వద్దకు వెళ్లి ప్రజా సమస్యలు, అభివృద్ధి అవసరాలపై వినతిపత్రాలు అందించాలని సూచించారు.మున్సిపల్ ఎన్నికలు జరిగి దాదాపు ఐదు నెలలు గడిచిందని, కల్లూరు మున్సిపాలిటీలో ఇప్పట్లో ఎన్నికలు లేవనే విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు గుర్తించాలని అన్నారు. ఇకనైనా రాజకీయాలకు స్వస్తి పలికి కల్లూరు సమగ్ర అభివృద్ధికి అందరూ కలిసి సహకరించాలని పుర చైర్మన్ ధరవత్ మోహన్ నాయక్ కోరారు.

# వైద్య కోర్సుల ఫీజుల పెంపును రద్దు చేయాలి: పీడీఎస్‌యూ

**కడప రూరల్ మన జనప్రగతి ఆగస్టు 30:-**

ప్రైవేట్ వైద్య, దంత వైద్య కళాశాలల్లో కోర్సుల ఫీజులను పెంచడం పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతుందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న అన్నారు.ఆదివారం కడపలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య పట్టా, దంత వైద్య పట్టా కోర్సుల ఫీజులను 10 శాతం, పీజీ కోర్సుల ఫీజులను 15 శాతం పెంచడం అన్యాయమన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులతో చర్చించకుండా ఫీజుల పెంపుపై నిర్ణయం తీసుకోవడం సరికాదని తెలిపారు.వైద్య విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను ప్రభుత్వం అడ్డుకోవాలని, పెంచిన ఫీజులను వెంటనే రద్దు చేసి అదనపు వసూళ్లపై నియంత్రణ విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఖాసీం, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



# ఇటీవల మరణించిన వ్యక్తి కుటుంబానికి శ్రీనగర్ గ్రామస్తుల ఆర్థిక సాయం

- 20,500 ఆర్థిక సహాయం అందజేత

**కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్తులు**



**మల్లంపల్లి మండల ప్రతినిధి మన జనప్రగతి ఆగస్టు 31:** ఇటీవల శ్రీనగర్ గ్రామంలో మృతి చెందిన అజ్మీరా రాములు కుటుంబాన్ని గ్రామస్తులు పరామర్శించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. రాములు మృతితో విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చిన గ్రామస్తులు, తమ వంతు సహాయంగా రూ.20,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రాములు మృతి కుటుంబానికి తీరని లోటని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆర్థిక సహాయం ద్వారా కుటుంబానికి కొంతమేర ఉపశమనం కలిగించడంతో పాటు, వారికి మనోధైర్యం కల్పించేందుకు గ్రామస్తులంతా ఐక్యంగా ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. అజ్మీరా రాములు కుటుంబానికి అవసరమైన సమయంలో స్పందించి ఆర్థిక సహాయం అందించిన గ్రామస్తుల సేవాభావాన్ని పలువురు అభినందించారు. కష్టకాలంలో తోటి మనిషికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయానికి తమ వంతు సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ అజ్మీరా రాములు కుటుంబ సభ్యులు, శ్రీనగర్ గ్రామస్తులు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం మనందరి సామాజిక బాధ్యత" అని గ్రామస్తులు పేర్కొన్నారు.

# మతతత్వ రాజకీయాలకు ప్రజా ఐక్యతే ప్రత్యామ్నాయం

**అమరవీరుల ఆశయ సాధనకు ఉద్యమాలే మార్గమని రెడ్ స్టార్ జనరల్ బాడీ స్పష్టం**

**ప్రజల మౌలిక సమస్యలపై ఉద్యమాల నిర్మాణానికి ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ బాడీ పిలుపు**




**హనుమకొండ ప్రతినిధి, మన జనప్రగతి ఆగస్టు 31:** దేశంలో పెరుగుతున్న సామాజిక, ఆర్థిక అసమానతలు, క్రోనీ క్యాపిటలిజం, మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ బాడీ సమావేశం పిలుపునిచ్చింది. కార్మికరైతుదళితబహుజన ఐక్యతను విస్తరించడమే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రధాన కర్తవ్యమని సమావేశం స్పష్టం చేసింది. ఆదివారం వరంగల్ లో రాష్ట్ర నాయకులు మండల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పార్టీ నిర్మాణం, ప్రజా ఉద్యమాల దిశ, సమకాలీన రాజకీయ పరిణామాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ భాషా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను గుర్తుచేస్తూ, నేటి పరిస్థితుల్లో ప్రజల వాస్తవ సమస్యలను కేంద్రంగా చేసుకున్న ఉద్యమాల ద్వారానే ప్రజల విశ్వాసాన్ని పొందగలమన్నారు. ఉపాధి, భూమి, విద్య, వైద్యం, కనీస వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై ఐక్య పోరాటాలు నిర్మించాలని సూచించారు. కులం, మతం పేరుతో సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలను ఎదుర్కొనేందుకు ప్రజాస్వామిక, లౌకిక, ప్రగతిశీల శక్తుల సమన్వయం అవసరమని నాయకులు పేర్కొన్నారు. గ్రామస్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతర ఉద్యమాలు చేపట్టడం, రాయచూరులో జరగనున్న 13వ జాతీయ పార్టీ మహాసభలను విజయవంతం చేయడం లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. ఈ సమావేశంలో గోగర్ల శంకర్, సురుగు ప్రభాకర్, గడ్డం శరత్, ఎం.ఏ. పాషా, రైతు సమితి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, కార్మికులు, రైతులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో కాసుల మల్లికార్జున్‌కు గౌరవ డాక్టరేట్




**హైదరాబాద్, మన జనప్రగతి ఆగస్టు 31:** సమాజ హితం కోసం విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త కాసుల మల్లికార్జున్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి అమెరికా (న్యూజెర్సీ)లోని 'యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పుదుచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి డాక్టర్ కె. వెంకటేశన్ మాట్లాడుతూ సమాజం పట్ల నిబద్ధతతో నిస్వార్థ సేవలు అందించే వారికి ఎల్లప్పుడూ సముచిత గుర్తింపు, గౌరవం లభిస్తాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నర్సింహా గౌడ్ మాట్లాడుతూ సామాజిక సేవ, విద్య, వైద్యం, కళలు, సైన్స్ తదితర రంగాల్లో విశేష కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి గౌరవ డాక్టరేట్లతో సత్కరించడం జరుగుతోందని తెలిపారు. గౌరవ డాక్టరేట్ పొందిన అనంతరం కాసుల మల్లికార్జున్ ఆదివారం కాచిగూడలో మీడియాతో మాట్లాడారు. తన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించిన యూనివర్సిటీ ప్రతినిధులకు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నర్సింహా గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులకు, సేవా కార్యక్రమాల్లో నిరంతరం భాగస్వాములవుతున్న తోటి స్వచ్ఛంద కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# అమ్మమ్మ ఇంటికి వచ్చి.. అనంతలోకాలకు ఇద్దరు బాలురు

**- పండుగ పూట విషాదం..**

**మొండి కుంటలో పడి ఇద్దరి మృతి**

**- బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రమాదం**





**ములుగు జిల్లా,మన జనప్రగతి ఆగస్టు 31:** రాఖీ పండుగ సందర్భంగా అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందిన విషాద ఘటన ములుగు జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ములుగు జిల్లా జీవంతరావుపల్లి అమ్లెట్ విలేజ్ పరిధిలోని గణేష్‌లాల్‌పల్లి (మహరాజ్‌పల్లి) గ్రామ సమీపంలోని మొండి కుంటలో పడి మాలోత్ వినయ్ కుమార్ (15), రాజేష్ (12) మృతి చెందారు. మృతులు మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. రాఖీ పండుగను పురస్కరించుకుని ఇద్దరు బాలురు తమ అమ్మమ్మ ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో బహిర్భూమికి వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు మొండి కుంటలో పడిపోయినట్లు సమాచారం. నీటిలో మునిగిపోవడంతో ఇద్దరూ మృతి చెందారు. మృతులు సునీతయాకూబ్ దంపతుల పిల్లలు. పండుగ సందర్భంగా సంతోషంగా అమ్మమ్మ ఇంటికి వచ్చిన తమ పిల్లలు విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు బాలురు మృతి చెందడంతో కమలాపురం గ్రామంతో పాటు ఘటన జరిగిన గణేష్‌లాల్‌పల్లి పరిసరాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సెప్టెంబర్ 1న ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడు

# కేసీ గుప్త 107వ జయంతి వేడుకలు

- రాంకోఠి జైన్ భవన్‌లో ఏర్పాట్లు పూర్తి
- ముఖ్య అతిథులుగా అమరవాది లక్ష్మీనారాయణ, డీఐజీ దుద్దేళ్ల శ్రీనివాస్
- జయంతి సందర్భంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు: నిర్వాహకులు



**హైదరాబాద్, మన జనప్రగతి ఆగస్టు 31:** హైదరాబాద్ విమోచన పోరాటంలో కీలకపాత్ర పోషించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, వాసవీ ఉద్యమ పితామహుడు దివంగత కల్వకుంట్ల చంద్రసేన గుప్త (కే.సి. గుప్త) 107వ జయంతి వేడుకలను సెప్టెంబర్ 1వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్యవైశ్య సంఘం ఇసామియా బజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్త, ప్రాజెక్టు అడ్వైజర్ కొమిరిశెట్టి అనిల్ కుమార్ వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 1న నగరంలోని రాంకోఠి పరిధిలో గల శ్రీ జైన్ భవన్‌లో ఈ జయంతి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, హైదరాబాద్ సంస్థాన విముక్తి కోసం కేసీ గుప్త చేసిన పోరాటం, త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. వాసవీ క్లబ్స్ వ్యవస్థాపన ద్వారా సమాజ సేవకు నూతన దిశానిర్దేశం చేసిన మహనీయుడని, ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, డీఐజీ దుద్దేళ్ల శ్రీనివాస్ లతో పాటు పలువురు సామాజిక, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. జయంతిని పురస్కరించుకుని పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, కుల బాంధవులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద తారు రోడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ సాధారణ నిధులతో రూ.33 లక్షలతో రోడ్డు నిర్మాణం**


**ప్రజా సమస్యల పరిష్కారానికి మేయర్ ప్రత్యేక చొరవ రాకపోకలకు మరింత సౌకర్యం**





**తీగలగుట్టపల్లి మన జనప్రగతి ఆగస్టు 31:** తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద సరైన రోడ్డు సౌకర్యం లేక స్థానిక ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తీగలగుట్టపల్లి రైల్వే గేట్ నుండి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, రోడ్డు సౌకర్యం సరిగా లేక ముఖ్యంగా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యను వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో మేయర్ సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధుల కొరత ఉందని ఆర్అండ్‌బీ అధికారులు మేయర్‌కు తెలియజేయడంతో, ప్రజలు మరింత కాలం ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గంలో సమస్యను పరిష్కరించాలని మేయర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా మున్సిపల్ సాధారణ నిధులు (వీ+ఖీ) నుంచి రూ.33 లక్షలు కేటాయించి తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద రూ.33 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న తారు రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవతో సేతుబంధన్ స్కీం కింద ఆర్ఓబీ నిర్మాణానికి దాదాపు రూ.150 కోట్ల నిధులు మంజూరు చేయించారని, ఆ నిధులతో చేపట్టిన ఆర్ఓబీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కరీంనగర్ నగరానికి కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కృషి చేస్తున్నారని మేయర్ పేర్కొన్నారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందించడమే నగర పాలక సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు నగర పాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద తారు రోడ్డు నిర్మాణం పూర్తయితే రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మేయర్ అన్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్ణయించిన గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నగర పాలక సంస్థ వద్ద అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని మేయర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు. తీగలగుట్టపల్లి రైల్వే గేట్ వద్ద రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించినందుకు స్థానిక ప్రజలు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కి మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మేయర్ తీసుకున్న చొరవను స్థానికులు అభినందించారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు సాదినేని లావణ్య మునిందర్, భారీ అపర్ణ జితేందర్, మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులు, స్థానిక ప్రజలు, నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మెగా యూత్ ఫోర్స్ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడిగా హితేష్ రాయల్



**కడప టౌన్ మన జనప్రగతి ఆగస్టు 30:-** మెగా యూత్ ఫోర్స్ కడప జిల్లా కమిటీలో జిల్లా కార్యనిర్వాహక సభ్యుడిగా బీహారం హితేష్ రాయల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మెగా యూత్ ఫోర్స్ జిల్లా కమిటీ సభ్యులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. యువతను ఏకతాటిపైకి తీసుకువస్తూ, ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. హితేష్ రాయల్ నాయకత్వంలో మెగా యూత్ ఫోర్స్ మరింత బలోపేతం కావాలని వారు ఆకాంక్షించారు.

## ఓనం వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



**పటాన్ చెరువు మన జనప్రగతి ఆగస్టు 39:-** నాయర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం డివిజన్‌లోని స్త్రీ కన్వెన్షన్ హాల్‌లో కేరళ రాష్ట్ర ప్రధాన పండుగ అయిన ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ, కేరళ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే ఓనం పండుగలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రేమ, సోదరభావం, ఐక్యత, సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ ప్రతి కుటుంబంలో సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా భారతదేశం వైవిధ్యభరిత సంస్కృతుల సమ్మేళనమని, భాషలు, సంప్రదాయాలు వేర్వేరుగా ఉన్నా అందరం ఒకే కుటుంబ సభ్యులమనే భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో పరస్పర గౌరవం, సహకారం పెంపొందించే ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఓనం సందర్భంగా ఏర్పాటు చేసిన పూల రంగవల్లులు, సాంప్రదాయ కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాల్గొన్న వారు ఒకరికొకరు ఓనం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందోత్సాహాలతో వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్ పిళ్ళై, జనరల్ సెక్రటరీ వినోద్ కుమార్, శశిధరన్ నంబియార్, అనిల్ కుమార్, సంతోష్, సుదర్శన్, ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, మిల్క్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి ఘట్టం కార్యక్రమంలో పాల్గొన్న బూరుగడ్డ పుష్పనగేష్



**పటాన్ చెరువు మన జనప్రగతి ఆగస్టు 30:-** శ్రావణమాస బోనాల పండుగ సందర్భంగా రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మందుముల శ్రీనివాస్ నగర్ కాలనీలో వెలసిన శ్రీశ్రీశ్రీ ఐదుగుళ్ల పోచమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన ఘట్టం కార్యక్రమంలో రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రాంత ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, మహిళలు సంప్రదాయ బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పుష్పనగేష్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## కొవ్వూరులో ఘనంగా మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు విగ్రహావిష్కరణ



**కొవ్వూరు,మన జనప్రగతి ఆగస్టు 30:-** తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, దివంగత పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) విగ్రహావిష్కరణ కార్యక్రమం దొమ్మేరు బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరై కృష్ణబాబు విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో నాయకులు కృష్ణబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, నిస్వార్థ రాజకీయ నాయకుడిగా సుదీర్ఘకాలం ప్రజలకు సేవలందించిన పెండ్యాల కృష్ణబాబు కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పలువురు నాయకులు కృష్ణబాబుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ నివాళులర్పించారు.

## డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ ఆధ్వర్యంలో గుంటుపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**విజయవాడ మన జనప్రగతి ఆగస్టు 31:-** విజయవాడలోని ప్రముఖ డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ సౌజన్యంతో గుంటుపల్లిలోని 'ది పార్క్ రెసిడెన్స్' అపార్ట్‌మెంట్‌లో ఉచిత కార్డియో-మెడికల్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించబడింది. ఈ ప్రాథమిక ఆరోగ్య పరీక్షల శిబిరానికి అపార్ట్‌మెంట్ లో నివాసం ఉంటున్న సుమారు 77 కుటుంబాల సభ్యులు హాజరై వైద్య సేవలు పొందారు. డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ హాస్పిటల్ ప్రముఖ కార్డియాలజిస్టులు మరియు క్లినికల్ స్పెషలిస్టులు డాక్టర్ శిరీష, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ అనిల్ నేతృత్వంలోని పారామెడికల్ బృందం బీపీ, షుగర్, ఈసీజీ, 2ఐ-ఎకో కార్డియోగ్రామ్ తదితర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించింది.. ల్యాబ్ నివేదికల అనంతరం పరీక్షలు చేయించుకున్న వారి హృదయ స్పందనల పనితీరు, రక్తప్రసరణ, ఇతర జీవక్రియల స్థితిపై వైద్యులు వ్యక్తిగత వైద్య సలహాలు, దైనందిన జీవనశైలిలో తీసుకోవాల్సిన చర్యలు, అవసరమైన ముందస్తు జాగ్రత్తలను సూచించారు. ఈ సందర్భంగా ది పార్క్ రెసిడెన్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పెంటమరాజు గోపాల్ రావు మాట్లాడుతూ... "ఇలాంటి ప్రివెంటివ్ హెల్త్ చెకప్‌ల వల్ల గుండె సంబంధిత మరియు దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందే అవకాశం లభిస్తుంది" అని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి కార్డియో-మెడికల్ క్యాంపులను మరిన్ని నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా అందుబాటులో అత్యాధునిక వైద్యం అందిస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు పొందినడా. వరుణ్ కార్డియాక్ సైన్సెస్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ ఆరోగ్య పరిరక్షణ దిశగా సేవలు అందించిన డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ వైద్య బృందాన్ని మరియు పారామెడికల్ సిబ్బందిని అపార్ట్‌మెంట్ యాజమాన్యం ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేసింది. కార్యక్రమంలో ది పార్క్ రెసిడెన్స్ కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సుజన్, సునీల్, పార్థసారథి, శ్రీనివాసులు, సతీష్, మునిప్రసాద్, అపార్ట్మెంట్ వాసులు నాగరాజు, రవితేజ, మాధవ్, హిమబిందు, విజయదుర్గ, గౌరీ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా రక్షాబంధన్

### - బొమ్మనహల్ మండలవ్యాప్తంగా ఘనంగా రాఖీ వేడుకలు



**బొమ్మనహల్ మన జనప్రగతి ఆగస్టు 30:-** అన్నాచెల్లెళ్ల అనురాగానికి, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను బొమ్మనహల్ మండలవ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కలు, చెల్లెళ్లు తమ అన్నలు, తమ్ముళ్లకు ప్రేమాభిమానాలతో రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇళ్లలోనే కాకుండా వివిధ ప్రాంతాల్లోనూ రక్షాబంధన్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. సోదరీమణులు రాఖీలు కట్టి, సోదరుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు కానుకలు అందజేసి ప్రేమను చాటుకున్నారు. పలుచోట్ల రాఖీలు కట్టి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. రాఖీలో పవిత్రత, ఆత్మీయత, సోదరభావం ఇమిడి ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సమాజంలో స్నేహభావం, సోదరభావాన్ని పెంపొందించే గొప్ప పండుగగా రక్షాబంధన్ నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా రక్షాబంధన్‌ను ఘనంగా నిర్వహించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు

## కరువు నేలకు కృష్ణమ్మ వరప్రదాయిని వెలిగొండతో రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు



**అమరావతి, మన జనప్రగతి ఆగస్టు 30:-** పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుతో ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల మెట్ట ప్రాంతాల్లో రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు రానున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి 43.53 టీఎంసీల కృష్ణా వరద జలాలను మళ్లించి 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు, లక్షలాది ప్రజలకు తాగునీటి భరోసా కల్పించేలా ప్రాజెక్టును రూపొందించారని తెలిపారు. కరువు, ఫ్లోరైడ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు వెలిగొండ జీవనాధారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. 1996లో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును నేడు ఆయన చేతుల మీదుగా జాతికి అంకితం చేయడం చారిత్రక ఘట్టమని మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ పనులను వేగవంతం చేసి, కీలక నిర్మాణాలను పూర్తి చేసిందన్నారు. వెలిగొండ ద్వారా చెరువులు నిండడం, భూగర్భ జలాలు పెరగడం, పంటల సాగు విస్తరించడం, గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు కరువు కారణంగా జరిగే వలసలకు అడ్డుకట్ట పడుతుందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు కరువు ప్రాంతాల రైతుల భవిష్యత్తుకు భరోసా కల్పించే జీవనరేఖ అని అన్నారు.

## మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి దంపతుల శంకుస్థాపన



**నెల్లూరు మన జనప్రగతి ఆగస్టు 30:-** నెల్లూరు సిటీ నియోజకవర్గం నవాబుపేటలోని ప్రాచీన బలిజ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, ఆయన సతీమణి రమాదేవితో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మవారి సేవ చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. దాతల సహకారంతో రూ.1.01 కోట్ల అంచనా వ్యయంతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆలయ నిర్మాణంలో భక్తులందరూ భాగస్వాములు కావాలని కోరారు. స్థానిక మహిళలు మంత్రికి రాఖీలు కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. ఆలయ పునర్నిర్మాణానికి సిటీ టీడీపీ నాయకులు రూ.8.25 లక్షల విరాళాలను ప్రకటించి ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## అడపూరులో మహిళల భద్రత, సైబర్ మోసాలు, బాల్య వివాహాలపై అవగాహన



**నందలూరు మన జనప్రగతి ఆగస్టు 30:-** వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు నందలూరు ఎస్ఐ మల్లిఖార్జున రెడ్డి ఆధ్వర్యంలో అడపూరు దిగువ హరిజనవాడలో మహిళల భద్రత, సైబర్ మోసాలు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, బాలికలు ఇబ్బందులు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు వివరాలు, ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, బాలికలకు 18 ఏళ్లు పూర్తయ్యే వరకు వివాహం చేయరాదని అవగాహన కల్పించారు. నందలూరు పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ముత్తరాయపల్లిలో పోలీసుల అవగాహన కార్యక్రమం



**మైదుకూరు మన జనప్రగతి ఆగస్టు 30:-** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, మైదుకూరు డీఎస్పీ జి. రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ముత్తరాయపల్లిలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. మైదుకూరు పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముద్దనూరు పోలీసుల ఆధ్వర్యంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



**ముద్దనూరు మన జనప్రగతి ఆగస్టు 30:-** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ముద్దనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి సీఐ నగేష్ బాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టబద్ధమైన జీవనం సాగించాలని, గొడవలు, వివాదాలు మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

**తిరుపతి మన జనప్రగతి ఆగస్టు 30:-** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ, ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆగస్ట్ 31వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-222 7208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎం.జయకృష్ణ, తెలియజేశారు. గమనిక: అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174